# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 23-11-2025** **సమయం : 6.45 గంటలు**

# ముఖ్యాంశాలు

**1. దేశం 2047 నాటికి ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉంటుందని ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ పేర్కొన్నారు.**

**2. డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో రహదారులన్నింటిని గుంతల రహితంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు.**

**3. నూతన కార్మిక చట్టాలు దేశ పారిశ్రామిక వృద్ధికి కీలకం కానున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు.**

**4. గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది.**

**5. 13 వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పి. నారాయణ పేర్కొన్నారు.**

==========================

దేశం 2047 నాటికి ప్రపంచంలోనే అగ్ర స్థానంలో ఉంటుందని ఉప రాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలో నిన్న నిర్వహించిన శ్రీ సత్యసాయి ఇనిస్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ లెర్నింగ్ 44వ స్నాతకోత్సవంలో ఆయన పాల్గొని పట్టభద్రులైన విద్యార్థులకు పట్టాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పేర్కొంటూ..

వాయిస్... 32 సెకన్లు

సత్యసాయి బాబా విశిష్ట విద్యా విధానానికి విద్యార్థులే ప్రతిరూపాలని ఈ స్నాతకోత్సవంలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పేర్కొన్నారు. పట్టభద్రులు అయిన వారంతా నిస్వార్థ సేవ, కరుణ, నిజాయితీ అనే విలువలను ఆచరించాలన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ...

వాయిస్... 30 సెకన్లు

--------------------------

ఉపరాష్ట్రపతి సి.పి రాధాకృష్ణన్ ఈ రోజు ఆంధ్రప్రదేశ్ లోని శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని బాబా వారి శతజయంతి ఉత్సవాల ముగింపు వేడుకలలో పాల్గొననున్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి

నారా చంద్రబాబు నాయుడు, తెలంగాణ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి పాల్గొననున్నట్లు జిల్లా అధికారులు వెల్లడించారు.

---------------------------

డిసెంబర్ చివరి నాటికి రాష్ట్రంలో రహదారులన్నింటిని గుంతల రహితంగా తీర్చిదిద్దాలని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. రహదారుల అభివృద్ధి పనులపై శ్రవణ మాధ్యమ సమావేశాన్ని ఆయన నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. రహదారుల అభివృద్ధిలో అధునాతన సాంకేతిక విధానాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం అమలులోకి తీసుకువచ్చిన నాలుగు నూతన కార్మిక చట్టాలు దేశ పారిశ్రామిక వృద్ధికి కీలకం కానున్నాయని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. 1991 అనంతరం అత్యంత కీలకమైన సంస్కరణలు ఇవేనని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కార్మిక చట్టాలతో ఉద్యోగ భద్రత బలోపేతం కావడంతోపాటు, వేతనాలకు సంపూర్ణ హామీ లభిస్తుందని వెల్లడించారు.

---------------------------

గ్రామ పంచాయతీ ఎన్నికలకు రిజర్వేషన్ విధానాన్ని తెలంగాణ ప్రభుత్వం ఖరారు చేసింది. ఈ మేరకు ఎన్నికల రిజర్వేషన్లపై ఆ శాఖ ముఖ్య కార్యదర్శి ఎన్.శ్రీధర్ ఉత్తర్వులు జారీ చేశారు. కులగణన ఆధారంగా గ్రామ పంచాయతీ ఎన్నికల్లో వార్డు సభ్యుల పదవులకు రిజర్వేషన్లు అమలు చేయాలని ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. సర్పంచి పదవుల్లో బీసీలకు కులగణన ఆధారంగా, ఎస్సీ, ఎస్టీలకు 2011 జనాభా లెక్కల ప్రకారం రిజర్వేషన్లు కల్పిస్తున్నట్లు స్పష్టం చేశారు.

---------------------------

కేంద్ర ప్రభుత్వం చేపట్టిన అమృత్ పథకంలో భాగంగా 13 వేల కోట్ల రూపాయలతో రాష్ట్రంలోని మున్సిపాలిటీల్లో మౌలిక సదుపాయాలను కల్పిస్తామని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర పట్టణాభివృద్ధి శాఖ మంత్రి డాక్టర్ పొంగూరు నారాయణ తెలిపారు. నెల్లూరులోని నగరపాలక సంస్థ కార్యాలయంలో అభివృద్ధి పనులపై సమీక్ష సమావేశాన్ని నిన్న నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలోనే వివిధ పథకాల కింద 800 కోట్ల రూపాయల అభివృద్ధి పనులకు ప్రణాళికలను రూపొందించామని తెలిపారు.

---------------------------

సమాచార, ప్రసార రంగాల్లో విశిష్ఠమైన విశ్వసనీయమైన సేవలందిస్తోన్న ప్రసారభారతి నేటితో 28 సంవత్సరాలు పూర్తిచేసుకుంది. 1997 నవంబరు 23వ తేదీన పార్లమెంటు రూపొందించిన ప్రసారభారతి చట్టంతో బ్రాడ్ కాస్టింగ్ కార్పొరేషన్ ఆవిర్భవించింది. ప్రసారభారతి ఆధ్వర్యంలో ఆకాశవాణి, దూరదర్శన్‌లు ప్రజలకు విస్తృత సేవలను అందిస్తూ సమాచార, ప్రసారరంగంలో గణనీయమైన పాత్రను పోషిస్తున్నాయి.

---------------------------

తెలంగాణ డీజీపీ బి.శివధర్‌రెడ్డి ఎదుట 37 మంది మావోయిస్టులు నిన్న లొంగిపోయారు. లొంగిపోయిన వారిలో రాష్ట్ర కమిటీ సభ్యులు కొయ్యల సాంబయ్య, నారాయణ, సోమ్‌దా ఉన్నట్లు డీజీపీ వెల్లడించారు. మిగతా 34 మంది మావోయిస్టులంతా ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని తెలిపారు. లొంగిపోయిన వారిలో ముగ్గురు డివిజనల్

కమిటీ సభ్యులు, తొమ్మిది మంది ప్రాంతీయ కమిటీ సభ్యులు, 22 మంది దళ సభ్యులు ఉన్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా డిజిపి హైదరాబాదులో పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్.. 23 సెకన్లు)

---------------------------

గోవాలోని పనాజీ వేదికగా జరుగుతున్న 56వ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం-IFFIలో భాగంగా దేశ వ్యాప్తంగా 16 రాష్ట్రాలకు చెందిన జానపద కళాకారులు తమ కళారూపాలను ప్రదర్శించనున్నారు. 3వ రోజైన నిన్న హిమాచల్ ప్రదేశ్, తమిళనాడు, జమ్మూ- కాశ్మీర్‌లకు చెందిన జానపథ కళాకారులు తమన కళా రూపాలను ప్రదర్శించారు. ఈ జానపద నృత్య ప్రదర్శనలు ప్రేక్షకులను ఆకట్టుకున్నాయి.

---------------------------

ప్రధానమంత్రి నరేంద్రమోదీ తన మనసులోని భావాలను ఆకాశవాణి ద్వారా దేశ ప్రజలతో పంచుకునే "మన్ కీ బాత్" మనసులోని మాట కార్యక్రమం 128వ సంచిక ఈనెల 30వ తేదీ ఆదివారం ప్రసారమవుతుంది."మన్ కీ బాత్" కార్యక్రమానికి ప్రజలు తమ సూచనలు అందించాలని ప్రధానమంత్రి కోరారు. ప్రజలు తమ స్వర సందేశాలను 1800 11 7800 నెంబర్‌కు ఈనెల 28వ తేదీ సాయంకాలం వరకు పంపవచ్చు.

---------------------------

గౌహతిలో భారత్, దక్షిణ ఆఫ్రికా జట్లల మధ్య నిన్న ప్రారంభమైన రెండో టెస్ట్ మ్యాచ్‌లో టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న దక్షిణాఫ్రికా మొదటి రోజు ఆట ముగిసే సమయానికి 6 వికెట్ల నష్టానికి 247 పరుగులు చేసింది. ముత్తుస్వామి, కైల్ వెరినె క్రీజులో ఉన్నారు. భారత బౌలర్లలో కుల్‌దీప్ యాదవ్ 3, బుమ్రా, రవీంద్ర జడేజా, సిరాజ్ లు ఒక్కో వికెట్ చొప్పున పడగొట్టారు. రెండవ రోజు ఆట ఈ ఉదయం 9 గంటలకు ప్రారంభం కానుంది.

---------------------------

మలక్కా జలసంధి, దక్షిణ అండమాన్ సముద్రములో అల్ప పీడనం ఏర్పడిందని అమరావతిలోని భారత వాతావరణం కేంద్రం తెలిపింది. ఆపై ఇది పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ ఈ నెల 24 నాటికి ఆగ్నేయ బంగాళా ఖాతంలో వాయుగుండంగా బలపడే అవకాశం ఉందని అమరావతి వాతావరణం కేంద్రం అధికారి ఎం. వెంకట్రావు పేర్కొన్నారు. ఆ తరువాత పశ్చిమ- వాయువ్య దిశగా కదులుతూ, రానున్న 48 గంటల్లో నైరుతి బంగాళాఖాతంలో మరింత బలపడే అవకాశం ఉందని పేర్కొంటూ..

వాయిస్.. 20 సెకన్లు

తెలంగాణలో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు అక్కడక్కడా కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ కేంద్రం వెల్లడించింది.

====================